సాక్షి
ప్రకాశం

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



చట్ట వ్యతిరేక చర్యలను ఉపేక్షించం

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ హెచ్చరించారు. నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. - IIలో..



పేదల సొమ్ము కొల్లగొట్టిన టీడీపీ

పేదల సొమ్మును టీడీపీ పాలకులు కొల్లగొట్టారని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
36/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మార్కాపురంలో స్పందన

మార్కాపురం టౌన్: పట్టణంలోని కాలేజీ రోడ్డులో ఉన్న సౌజన్య ఫంక్షన్ హాలులో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక స్పందన ప్రారంభమవుతుందని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు స్పందనలో పాల్గొంటారన్నారు. మార్కాపురంటౌన్, మార్కాపురం మండలానికి చెందిన ప్రజలు వారి సమస్యలను స్పందనలో కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

పీడియాట్రిక్స్ సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి చర్యలు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న 4 పీడియాట్రిక్స్ సీనియర్ రెసిడెంట్స్ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎన్‌సీయులో నియామకం చేసేందుకు వైద్య పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. వివరాలకు www.gmcongole.org, http://prakasam.ap.gov.in/notice category/recruitment లో పొందుపరిచామన్నారు. దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత సర్టిఫికెట్లు జతచేసి సాఫ్ట్ కాపీని ongolegmc@gmail.com అనే ఈ మెయిల్‌కు పంపాలన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సమయంలో 3 అటేస్టేషన్ కాపీలు తీసుకురావాలని పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈలకు రుణ సౌకర్యం

● సిడ్బీ డీజీఎం రాజేంద్రప్రసాద్



కలెక్టర్‌ను కలిసిన సిడ్బీ డీజీఎం రాజేంద్ర ప్రసాద్, పరిశ్రమలశాఖ జీఎం శ్రీనివాసరావు

ఒంగోలు సబర్బన్: ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు విజయవాడ సిడ్బీ డీజీఎం రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక ఐల సమావేశ మందిరంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలకు స్మాల్ ఇండస్ట్రీయల్ డవలప్‌మెంట్ బ్యాంక్(సిడ్బీ) ముందుంటుందన్నారు. రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించిన ఆయన ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో పాటు ఎగుమతులకు చెందిన యూనిట్లు, గ్రానైట్, దాల్ మిల్లులు, రైస్ మిల్లులు, సేవారంగం, మెడికల్ రంగాల్లో యూనిట్ల ఆధునికీకరణకు గానీ, కొత్త యూనిట్ల కోసం కానీ ముందుకు వస్తే రుణాలు అందిస్తామన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించటమే లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ముఖ్యంగా సోలార్ ఎనర్జీకి సంబంధించి ప్రత్యేకమైన స్కీంలు ఉన్నాయని తెలిపారు. అనంతరం ప్రకాశం భవన్‌లో కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్‌ను కలిసి సిడ్బీ చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం బి.శ్రీనివాసరావు కూడా ఉన్నారు.

విశ్వకర్మ పథకం అర్హులను గుర్తించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పీఎం విశ్వకర్మ పథకం ప్రయోజనం పొందేందుకు అర్హులను గుర్తించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. ఈ నెల 17వ తేదీ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పథకాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో జిల్లాలో అమలు చేయడంపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద గుర్తించిన 18 రకాల సంప్రదాయ చేతివృత్తి దారులకు టూల్‌కిట్, ఇన్సెంటివ్ కింద రూ.15వేలు ఆర్థిక సాయం చేయడంతో పాటు వారి పనిలో నైపుణ్యం పెంచుకునేలా తగిన శిక్షణ అందచేసి రోజుకు రూ.500 లెక్కన స్టైఫండ్ ఇవ్వాలని పథక మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. నైపుణ్య శిక్షణ అనంతరం వడ్డీ రాయితీతో బ్యాంకు రుణం కూడా లభించే విషయాన్ని చేతివృత్తిదారులకు తెలపాలన్నారు. లబ్ధిదారులను గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో గుర్తించాలని, ఆ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై వచ్చే వారం మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీఓ సంప్రదాయ చేతివృత్తిదారుల సంఘాలతో ప్రత్యేకంగా వర్క్‌షాప్ నిర్వహణకు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికి రాష్ట్రం నుంచి వెయ్యి అప్లికేషన్‌లు నమోదు కాగా వాటిలో 400 జిల్లా నుంచే ఉన్నాయన్నారు. మరింత మంది దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి. శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం పాల్గొన్నారు.

జీవన ప్రతిమ

అలనాడు కైలాసానా పార్వతీదేవి బొమ్మను చేసి ప్రాణం పోస్తే.. పరమేశ్వరుడు గజాననుడి తలతో గణనాథుడికి రూపమిస్తే..ఇలలో కళాకారులు లంబోదరుడి బొమ్మలు చేసి.. జీవం పోస్తున్నారు. వినాయక చవితికి విభిన్నరూపాల్లో లంబోదరుడు దర్శనమిస్తాడు. పల్లెపట్నం తేడాలేకుండా వాడవాడల గణేష్ విగ్రహాలను ప్రతిష్టిస్తారు. మహా గణపతిం.. మనఃస్మరామి.. అంటూ భక్తుల నామస్మరణతో పల్లెలు, గల్లీలు మార్మోగుతాయి. నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఒంగోలు నగరంలో అడుగు నుంచి 10 అడుగుల ప్రతిమలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రత్యేకమైన డిజైన్లతో ముస్తాబు చేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా విభిన్న రూపాల్లో గణనాథుని తయారు చేసేందుకు రాజస్థాన్ కళాకారులు శ్రమిస్తున్నారు. అక్కడ నుంచి వలస వచ్చి జిల్లాలో స్థిరపడిన వీరి 'బతుకు చిత్రం' తెలుసుకుందాం..

– ఒంగోలు డెస్క్

● మహాగణపతితోనే జీవనయానం ● విగ్రహాల రూపకల్పనలో రాజస్థాన్ కళాకారుల నైపుణ్యం

● విభిన్నరూపాల్లో గణనాథుని దర్శనం ● నాలుగు దశాబ్దాలుగా బొమ్మల తయారీ

● ముడిసరుకంతా హైదరాబాద్ నుంచే దిగుమతి



ఊరూవాడా ఏకమైన చిన్నా పెద్దా అందరూ కలసి సంతోషంగా నిర్వహించుకునే పండగ వినాయక చవితి. అన్ని విఘ్నాలు తొలగించి, చేయబోయే కార్యం సిద్ధించేలా ఆ గణనాథుడు రక్షిస్తాడని హిందువుల విశ్వాసం. ఇక చవితి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది వినాయకుని విగ్రహం. ఏటా వేల సంఖ్యలో విగ్రహాలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు ఎందరో కళాకారులు. మరికొందరు వంశపారపర్యంగా విగ్రహాల తయారీని అందిపుచ్చుకుంటున్నారు. అందులో రాజస్థాన్ నుంచి జిల్లాకు వలస వచ్చిన రాథోడ్ సునాజీ కుటుంబం ఒకటి. రాజస్థాన్‌లోని పాల్కా గ్రామానికి చెందిన సునాజీ, ఆయన భార్య మౌర్య, మరికొందరు బంధువులు తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడేనికి వలస వచ్చారు. అక్కడ వ్యవసాయం చేసుకునే వీరు బతుకుదెరువు కోసం కొత్తగూడెం, విజయవాడ, చీరాల, నెల్లూరు జిల్లాల్లో తిరిగి నాలుగు దశాబ్దాల క్రితం ఒంగోలు వచ్చి స్థిరపడ్డారు. వివిధ రకాల దేవుని విగ్రహాలతో పాటు, వణ్యప్రాణులైన ఏనుగులు, కుందేళ్లు, జింకల బొమ్మలు తయారుచేసి తోపుడుబళ్లపై విక్రయించేవారు. ఆ తర్వాత వినాయక చవితికి విగ్రహాలు తయారు చేయడం మొదలుపెట్టారు. రాథోడ్‌కు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పదేళ్ల కిందట ఆయన మృతి చెందారు. మౌర్య, కుమారులు నగరంలోనే ఉంటూ విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. నగర శివారులోని ఐదారు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను అద్దెకు తీసుకుని విగ్రహాలు తయారు చేస్తున్నారు. అలాగే మరికొంత మంది రాజస్థాన్ కళాకారులు పొదిలి, మార్కాపురం, గిద్దలూరు, కొమరోలు, మద్దిపాడు, బాపట్ల జిల్లాలోని అద్దంకి తదితర ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను విభిన్న రూపాల్లో తీర్చిదిద్ది విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రతిమలు తయారు చేయడంలో రాజస్థాన్ కళాకారుల తర్వాతే ఎవరైనా.. అనేలా పేరు తెచ్చుకున్నారు.



గణనాథుని విగ్రహానికి తుది మెరుగులు

ఆరు నెలల ముందు నుంచే..

వినాయక చవితి పండుగకు ఆరు నెలల ముందు నుంచే ప్రతిమల తయారీకి సిద్ధమవుతారు. విగ్రహాల తయారీకి అవసరమైన ముడి సరుకును హైదరాబాద్ నుంచి తెచ్చుకుంటారు. అంతేకాకుండా అత్యంత ఆకర్షణీయంగా రూపొందించేందుకు అవసరమైన వివిధ రూపాల అచ్చులను సైతం హైదరాబాద్ నుంచే అద్దె ప్రాతిపదికన తెచ్చుకుంటారు. ఆరు నుంచి పది అడుగులు ఉండే విగ్రహాలను రోజుకు ఎనిమిది లేదా పది తయారు చేస్తారు. రూపాన్ని బట్టి అచ్చులకు రోజువారీ అద్దె చెల్లిస్తారు. ఒక్కో అచ్చుకు సుమారు రూ.10 వేలు చెల్లిస్తున్నారు. విగ్రహాలను వేగంగా, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్‌లోనే ఉంటున్న రాజస్థాన్ కళాకారులను నియమించుకుని రోజు ప్రాతిపదికన వారికి కూలి ఇస్తారు. కిరీటాలు, చేతులు, తొండాలు ఇలా అన్నీ విడివిడిగా పోత పోస్తారు. అవి బాగా ఆరాక క్రమ పద్ధతిలో అతికించి, ఇట్టే ఆకట్టుకునేలా తుదిమెరుగులు దిద్దుతారు. చివరగా స్ప్రేయర్‌తో రంగులు వేసి విగ్రహాలను ముస్తాబు చేస్తారు. మామూలుగా అయితే ఒక విగ్రహం తయారీకి సుమారు పది రోజుల సమయం పడుతుంది. భారీ పరిమాణంలో విగ్రహాలకు సంబంధించి ఒకేసారి అచ్చులతో ఎనిమిది నుంచి తొమ్మిది విగ్రహాల తయారీకి రంగం సిద్ధం చేస్తారు.



రంగులు అద్దుతూ..

పది అడుగుల వరకే..

జిల్లాలో పెద్ద విగ్రహాలు అంటే పది అడుగుల వరకే తయారు చేస్తారు. మండపాలకు సంబంధించి ఎక్కువగా ఆరు అడుగుల నుంచి పది అడుగుల విగ్రహాలే విక్రయిస్తుంటారు. వీరు ఒక అడుగు నుంచి విగ్రహాలు తయారు చేస్తారు. చిన్న,చిన్న బొమ్మలను పండుగ రెండు రోజుల ముందు నుంచి తోపుడబళ్లపై తిరుగుతూ అమ్ముతుంటారు. వీటి తయారీకి అవసరమైన స్థలాన్ని ఊరికి దూరంగా ఉండే ప్రాంతాలను ఎంపిక చేసుకుంటారు. సంవత్సరానికి అద్దె చెల్లించేలా లీజుకు తీసుకుంటారు. వినాయక చవితి సీజన్ పూర్తయ్యాక మిగిలిన కాలంలో వివిధ రకాల దేవుళ్ల ప్రతిమలతోపాటు నెమలి, జింక, ఏనుగు, కుందేలు ఇలా రకరకాల వణ్యప్రాణుల బొమ్మలు తయారు చేసి విక్రయిస్తూ బతుకు బండిని నడిపిస్తున్నారు.

కరోనా తర్వాత కష్టాలు

కరోనా తర్వాత వీరికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. రెండేళ్ల పాటు కనీస ఉపాధి కరువైంది. 2021లో వ్యాపారం అంతంతమాత్రంగానే సాగిందని, గత ఏడాది పర్వాలేదని రాథోడ్ కుటుంబం చెబుతోంది. ఈ ఏడాది పండగకు మరో నాలుగు రోజుల సమయమే ఉన్నా ఇప్పటి వరకు హడావుడే కనిపించడం లేదని ఒకింత ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాల తయారీకి అప్పులు తెచ్చామని, బొమ్మలు అమ్మకపోతే బతికేదెలా అంటూ వాపోతున్నారు. ప్రస్తుతం విగ్రహాల తయారీలో పోటీ పెరిగింది. పక్క జిల్లాల్లో మూడు నెలల ముందు నుంచి విగ్రహాలు తయారు చేసి తక్కువ ధరకు విక్రయించి వచ్చిన కాడికి సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా వంశపారపర్యంగా తయారు చేసే వారు ఆర్థికంగా ఇబ్బందులు పడే పరిస్థితులు ఎదురవుతున్నాయి.

బతుకుదెరువు కోసం వలస వచ్చేశాం

రాజస్థాన్‌లో వ్యవసాయం చేసుకునేవాళ్లం. అక్కడ పరిస్థితులు బాగోలేక వలస వచ్చేశాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో జీవనోపాధి కోసం తిరిగాం. నలభై ఏళ్ల కిందట ఒంగోలు వచ్చి స్థిరపడ్డాం. అంతా కుదుటపడి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న సమయంలో నా భర్త రాథోడ్ మృతి చెందారు. వ్యాపారం కోసం ఆయన చేసిన అప్పులను ఇప్పటికీ తీరుస్తున్నాం. నలుగురు కుమారులు నగరంలో నాలుగు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో షెడ్లు వేసుకుని వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు.

– మౌర్య, రాథోడ్ సునాజీ భార్య





విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

కష్టానికి ప్రతిఫలం దక్కడం లేదు

వినాయక చవితికి విగ్రహాలు తయారు చేసేందుకు చాలా కష్టపడుతున్నాం. పండుగకు ఆరునెలల ముందే పనులు ప్రారంభిస్తాం. హైదరాబాద్ నుంచి ముడిసరుకు, అచ్చులు తీసుకువస్తాం. కళాకారులు కూడా అక్కడ నుంచే వస్తారు. ఒక విగ్రహానికి తయారీ ఖర్చులన్నీ పోను మాకు మిగిలేది చాలా తక్కువ మొత్తమే. ఈ ఏడాది వ్యాపారం ఇంత వరకు వ్యాపారం ప్రారంభం కాలేదు. కనీస ఖర్చులు వస్తాయో లేదో. పక్క జిల్లాల నుంచి కొంత మంది ఇక్కడకు వచ్చి తక్కువకు విక్రయిస్తున్నారు. దీంతో వ్యాపారం ఉంటుందో లేదోనన్న భయం ఉంది.

– ఆనంద్ చావన్, రాజస్థాన్ కళాకారుడు



పేదల పట్టాలు అడ్డుకోడానికి మనసెలా వచ్చింది..?

● 24 వేల మందికి ఒకే చోట ఇవ్వకుండా అడ్డంకులు సృష్టిస్తారా..

● మాజీ ఎమ్మెల్యే దామచర్లపై ఆగ్రహం

● రూ.200 కోట్లతో భూములు కొనుగోలు చేసి పట్టాలిస్తున్నాం

● పట్టాలివ్వకుండా వచ్చే ఎన్నికలకు వెళ్లను

● ఒంగోలు అభివృద్ధికి చర్చకు సిద్ధమా

● ఎల్లో మీడియా కథనాలపై మండిపాటు

● నాలుగేళ్లలో నగరంలో కొత్తగా 10 వేల పెన్షన్లు

● నూతన పెన్షన్‌ల పంపిణీలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



పెన్షన్ల పంపిణీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మేయర్ గంగాడ సుజాత



పెన్షన్లు పంపిణీ చేస్తున్న బాలినేని, పక్కన కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోల సబర్బన్: నిరుపేదల ఇళ్ల పట్టాలను అడ్డుకోవడానికి మనసెలా వచ్చిందని టీడీపీ నాయకులను మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. దామచర్ల జనార్దన్ కోర్టుకు వెళ్లి అడ్డుకోకుంటే ఈ పాటికే పేదలంతా వారి సొంతిళ్లలో సంతోషంగా ఉండేవారన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టీడీపీ నాయకులు అభివృద్ధి కంఠకులని ధ్వజమెత్తారు. ఒకేచోట 24 వేల మందికి పట్టాలు ఇవ్వాలని సిద్ధం చేస్తే ఓర్వలేకే అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల ఉసురు పోసుకుంటున్న టీడీపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజల అవసరాల నిమిత్తం రోడ్డు వేస్తే రోడ్డుపై రోడ్డు వేశామని ఎల్లో మీడియాలో అడ్డగోలు రాతలు రాస్తున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో రోడ్డు మీద రోడ్డు వేసి దోచుకున్నప్పుడు ఈ పచ్చ పత్రికలకు కళ్లు కనిపించలేదా అని ప్రశ్నించారు. పేదల ఇళ్ల పట్టాలను టీడీపీ నాయకులు అడ్డుపడ్డప్పుడు ఈ పచ్చ పత్రికలు నిద్రపోతున్నాయా అని నిలదీశారు. టీడీపీ నేతలు అడ్డుకున్నా పేదలకు ఇళ్ల పట్టాలిచ్చేందుకు రూ.200 కోట్లతో 508 ఎకరాల ప్రైవేట్ భూములు కొనుగోలు చేశామని తెలిపారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

పట్టాలివ్వకపోతే ఎన్నికల్లో పోటీ చేయను..

నగరంలో 25 వేల మంది పేదలకు పట్టాలివ్వకుంటే 2024 ఎన్నికల్లో తాను పోటీ చేయనని ఛాలెంజ్ విసిరారు. 25 వేల మందికి పట్టాలు ఇవ్వడంతో పాటు నా సొంత డబ్బులతో 25 వేల మంది మహిళలకు చీరలు కూడా పెట్టి పట్టాలు ఇస్తానని స్పష్టం చేశారు. పేదలపై ఏమాత్రం కనికరం లేని దామచర్ల జనార్దన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఇదేమి న్యాయం అని ప్రశ్నించారు. డ్రామాలు చేస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎవరు అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా..?

ఒంగోలు నగరాన్ని ఎవరు అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా అని టీడీపీ నాయకులకు బాలినేని సవాల్ విసిరారు. అంతా తామే చేశామని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏం చేయలేదని పదేపదే టీడీపీ నాయకులు అంటున్నారు. ఒంగోలు నగరంలో ఎవరు ఎన్ని పట్టాలు ఇచ్చారో చర్చలో తేల్చుకుందాం రండి అంటూ సవాలు విసిరారు. చర్చకు అన్ని ఏర్పాట్లు మేమే చేస్తాం రండి చర్చిద్దామని పిలుపునిచ్చారు. ఒంగోలు నగరాన్ని కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. టీడీపీ హయాంలో అమృత్ పథకం ద్వారా నిధులు వస్తే ఆ పనులను సకాలంలో పూర్తి చేయకుండా ఒంగోలు మున్సిపాలిటీ మీద రూ.70 కోట్లు భారం వేసి చేసి పనుల్లో పర్సంటేజీలు తీసుకొని చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. ఆ రూ.70 కోట్లు ప్రభుత్వం నుంచి తీసుకొచ్చి పనులు పూర్తి చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం మళ్లీ నగరానికి శాశ్వత మంచినీటి పథకానికి రూ.350 కోట్లు సీఎం మంజూరు చేశారని, ఆ పథకాన్ని కూడా సీఎం చేతుల మీదుగా భూమిపూజ చేయిస్తున్నామన్నారు. కొత్తపట్నం వద్ద షిప్పింగ్ హార్బర్ నిర్మాణానికి కూడా ముఖ్యమంత్రి వచ్చే నెలలోనే పనులు ప్రారంభిస్తారని వెల్లడించారు. బలరాంకాలనీ, పానుగుపాటి కాలనీ ఇలా టీడీపీ నాయకులు పేర్లు పెట్టుకున్న కాలనీలలో కూడా నేను ఇళ్ల పట్టాలు ఇచ్చానన్నారు. రాజీవ్ గృహకల్ప కాలనీలో తాను ఇళ్ల పట్టాలు ఇస్తే టీడీపీ హయాం వచ్చిన తరువాత ఆ పట్టాలను రద్దు చేశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నగరంలో 10 వేల మందికి కొత్త పెన్షన్‌లు ఇచ్చామన్నారు. 2019 ఎన్నికల వరకు కేవలం ఒంగోలులో 11 వేలు మాత్రమే ఉండేవని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సుకు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు ప్రసంగించారు. కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, జడ వెంకటేష్, చల్లా తిరుమల రావు, గిరిజా శంకర శాండిల్య, ఈదర చిన్నారి, మస్తానమ్మ, గోపిరెడ్డి గోపాల్ రెడ్డి, అంబటి ప్రసాదు, గోలి తిరుపతిరావు, యనమల నాగరాజు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చే వారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

సాయిబాబా సెంట్రల్ స్కూల్,
సాయిబాబా నగర్, పెళ్లూరు,
ఒంగోలు కార్పొరేషన్,
క్విస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్,
పొందూరు రోడ్డు, వెంగముక్కపాలెం,
ఒంగోలు కార్పొరేషన్

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 9010357744

క్లుప్తంగా

సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు రేపు

ఒంగోలు: ప్రకాశం జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు ఈనెల 16న స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కావూరి విన్సెంట్, అంచిపోగు రమేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ వెంట వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు రోజర్ బిన్నీ సెల్ నెంబర్ 9908822193 ను సంప్రదించాలన్నారు.

ఎస్‌జీఎఫ్ వాలీబాల్ క్రీడా జట్ల ఎంపిక రేపు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక ఈనెల 16న జె. పంగులూరు మండలం బూదవాడలో నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వనజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14, అండర్ -17 స్థాయిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో క్రీడాకారులు ఉదయం 9 గంటలకు బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాజరు కావచ్చన్నారు. అండర్- 17 కేటగిరీలో ఇంటర్ విద్యార్థులు, హాజరుకావచ్చని, వీరు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, జ్ఞాన భూమి చైల్డ్ ఐడీ నంబరు, సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రాన్ని నిర్వాహకులకు సమర్పించి పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ యం.వెంకట్రావును సంప్రదించాలన్నారు.

పశుగణాభివృద్ధి సంఘ ఎన్నికలు ఏకగ్రీవం

ఒంగోలు సబర్బన్: జిల్లా పశుగణాభివృద్ధి విభాగంలో జిల్లా సంఘం ఎన్నికలు గురువారం ఏకగ్రీవమయ్యాయి. సంఘ జిల్లా అధ్యక్షురాలిగా కోసూరి రాధా, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎర్నిపాటి నిర్మల, సీహెచ్ నాగేశ్వరమ్మ, మల్లవరపు కోటిలింగం, మంచు శ్రీనివాస రావు, రాయదుర్గం నారాయణతో పాటు పలువురు ఏకగ్రీవంగా ఎన్నికయిన వారిలో ఉన్నారు. ఎన్నికల అధికారిగా ఒంగోలు డివిజనల్ ఉపసంచాలకులు ఏ.రమేష్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికయిన కమిటీని జేడీ డాక్టర్ బేబీ రాణి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో మృతదేహం

పొదిలి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం ఒంగోలు-నంద్యాల రోడ్డులో కంభాలపాడు పాఠశాల సమీపంలో జరిగింది. కంభాలపాడు గ్రామానికి చెందిన మల్లవరపు బాలయ్య(52) నగర పంచాయతీ వాటర్ పంపిణీ విభాగంలో పని చేస్తున్నాడు. ఈక్రమంలో వాటర్ ట్యాంక్ దగ్గరకు మోటారు సైకిల్‌పై పొదిలి వైపు వెళుతున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టటంతో వాహనంపై నుంచి కింద పడి.. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ మెంబర్‌గా టీజేఆర్



రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డితో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా ప్రభుత్వం నియమించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తనను నియమించినట్లు ఎమ్మెల్యే టీజేఆర్ గురువారం తెలిపారు. ఇప్పటికే టీజేఆర్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖలకు మెంబర్‌గా కొనసాగుతున్నారు. అలాగే రాష్ట్ర అస్సైన్డ్ కమిటీ మెంబర్‌గా, ప్రివిలైజ్ కమిటీ మెంబర్‌గా కూడా కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విజయసాయిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డిని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు గురువారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు, హౌసింగ్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ కొలకలూరి విజయకుమార్, స్థానిక నాయకులున్నారు.

పేదల సొమ్ము కొల్లగొట్టిన టీడీపీ



స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



వృద్ధుని వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని

- టిడ్కో పేరుతో డబ్బు వసూలు చేసిన దామచర్ల
- పేదలకు ఆ డబ్బులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెల్లిస్తోంది
- 14,400 మంది వద్ద డబ్బు కట్టించుకొని 4 వేల ఇళ్లు మొదలు పెట్టారు
- ప్రతి ఇంటికీ వచ్చిన సంక్షేమ పథకాలు చదివి వినిపించిన ఎమ్మెల్యే బాలినేని
- 5వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

ఒంగోలు సబర్బన్: పేదల సొమ్మును టీడీపీ పాలకులు కొల్లగొట్టారని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. 5వ డివిజన్‌లోని రెండో వార్డు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. డివిజన్‌లోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌కు తూర్పు వైపున ఉన్న మహేంద్ర నగర్ నాలుగో లైన్ నుంచి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ జీవిత కాలం టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉన్నట్లుగా వాళ్ళు భ్రమించి పేదలను నిలువునా మోసం చేసే కార్యక్రమానికి తెర లేపారన్నారు. ఒంగోలు నగరంలోని నిలువ నీడలేని నిరుపేదలకు ఇళ్ళు కట్టిస్తామని నమ్మబలికి వారి వద్ద వేలకు వేలు డబ్బులు కట్టించుకొని నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. టిడ్కో ఇళ్ళు కట్టిస్తామని చెప్పి ఇళ్ళు ఇవ్వక పోగా వాళ్ళు కట్టిన డబ్బులు కూడా వాళ్ళకు ఇవ్వకుండా చేశారని మండి పడ్డారు. ఆ పేదల కడుపు కొట్టినందువల్లే టీడీపీ భూస్థాపితం అయిందన్నారు. ప్రస్తుతం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళుతుంటే.. అయ్యా టిడ్కో ఇళ్ళకు డబ్బులు కట్టాము, ఇళ్ళు ఇవ్వక పోగా, తాము కట్టిన డబ్బులు కూడా ఇవ్వటం లేదని ఆ నిరుపేదలు వాపోతున్నారని బాలినేని వివరించారు. అందుకే ముందు వాళ్ళు కట్టిన డబ్బులు వాళ్ళకు తిరిగి ఇస్తున్నామని బాలినేని పేర్కొన్నారు. ఆ తరువాత వాళ్ళందరికీ ఇళ్ళ పట్టాలు ఇచ్చి అనంతరం ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వమే ఆర్థిక సాయం చేస్తుందని వాళ్ళందరికీ భరోసా ఇస్తున్నామని వెల్లడించారు. 14,400 మంది వద్ద డబ్బులు కట్టించుకున్న టీడీపీ పాలకులు 4 వేల ఇళ్ళు మాత్రమే ప్రారంభించి నిలువునా మోసం చేశారని మండి పడ్డారు. ప్రతి గడపలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన, చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటికీ ధైర్యంగా తిరుగుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు, బొమ్మినేని మురళి, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, పార్టీ నాయకులు కఠారి శంకర్, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతి రావు, పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, చింతగుంట్ల సువర్ణ, పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, గొర్రెపాటి శ్రీనివాస రావు, పురిణి ప్రభావతి, చావల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, జడా వెంకటేష్, 5వ డివిజన్ అధ్యక్షుడు సి.హెచ్.సత్య నారాయణ రెడ్డి, జమ్ము శ్రీకాంత్, తాళ్ళపాలెం శ్రీను, సైదా, వాకా తిరుమల, పి.మోహన్ రావు, ఆసోది విజయలక్ష్మి, ఎస్‌కే.ఖుద్దూస్, రామిశెట్టి హరి, ఆవుల సురేంద్ర, గొల్లపోలు కృష్ణ, జాజుల కృష్ణ, రావులపల్లి శ్రీకాంత్, కఠారి సురేష్, మిరియం సుబ్బులు, గఫూర్, అబ్దుల్ ఖుద్దూస్ , దాసరి అమ్మన్న, మద్దసాని సుబ్బారావు, హైమావతి, పులి కృష్ణ, మిరియం వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నలుగురు బాలకార్మికుల గుర్తింపు

ఒంగోలు: ఆపరేషన్ స్వేచ్ఛ ఫేజ్ 3లో భాగంగా గురువారం నగరంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నలుగురు బాలకార్మికులను గుర్తించామని జిల్లా ఉప కార్మికశాఖ కమిషనర్ ఎస్.శ్రీనివాసకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి తనిఖీలు నిర్వహించామన్నారు. నగరంలో రిక్షాల బజారు, బాపూజీ మార్కెట్ సెంటర్, మంగమూరు రోడ్డు, పాత గుంటూరు రోడ్డులో విస్తృతంగా తనిఖీలు చేసి నలుగురు బాలకార్మికులను గుర్తించారు. వారిని తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సెలింగ్ ఇచ్చారు. యాజమాన్యాలపై కేసులు నమోదు చేశారు. సహాయ కార్మిక కమిషనర్ కె.కనకదుర్గ భవాని, సహాయ కార్మిక శాఖ అధికారులు ఎం.ఎలిజబెత్, వెంకటేశ్వర్లు, ఎన్‌జీవోలు, డీసీపీఓ దినేష్‌కుమార్, దిశ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌ను విమర్శించడం తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- టీడీపీ అవినీతిలో కూరుకుపోయింది
- ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుతో కేడర్‌లో నిరాశ, నిస్పృహలు
- మంత్రి సురేష్ గురించి మాట్లాడితే ఊరుకోం

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను విమర్శించడం సరయిన పద్ధతి కాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. అందుకు తగిన స్థాయి మీకు లేదని, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అవినీతి ఊబిలో కూరుకొని పోయి అరెస్ట్ కావడంతో నిరాశ, నిస్పృహలతో ఉన్న మీరు నోటికొచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. గురువారం చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా స్థానిక యూనియన్ బ్యాంకు వద్ద టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన నిరాహార దీక్షలో ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి మాట్లాడారు. మంత్రి సురేష్ విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో మన బడి నాడు-నేడు పనుల్లో అవినీతి జరిగిందని చెప్పడంలో అర్థంలేదని, ఆ పనులు పేరెంట్స్ కమిటీ, హెచ్ఎంల ఆధ్వర్యంలో జరిగాయని, నాణ్యతతో నిర్మించినవిగా కనిపించడంలేదా అని ప్రశ్నించారు. 2014-19లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబునాయుడు 23 మంది వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని, ఈ సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న ఆదిమూలపు సురేష్‌కు అనేక ప్రలోభాలకు గురిచేసి, తమ పార్టీలో చేరమని తీవ్రమైన ఒత్తిడీ తీసుకొని వచ్చారన్నారు. ఆ సమయంలో వైఎస్సార్ కుటుంబం వెంటే ఉంటానని, వారివలన నేను రాజకీయల్లో ప్రవేశించి నిజాయితీగా ప్రజలకు సేవలు అందిస్తున్నామని వివరించారు. తమ పార్టీలో చేరలేదన్న అక్కసుతో చంద్రబాబు అప్పట్లో ఇన్‌కంట్యాక్స్ కేసులు బనాయించి ఇబ్బందులపాలు చేశారని, ఈ విషయం ప్రజలకు బాగా తెలుసని వారన్నారు. అటువంటి వ్యక్తిపై నిందారోపణలు చేసుకుంటూ పోతే ఊరుకోరని వారు ఎరిక్షన్‌బాబును హెచ్చరించారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందచేస్తుందని, ఇది కూడా సహించలేక ఆ పథకాలపై విమర్శలు చేయడం సరయిన పద్ధతి కాదని వారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో టీడీపీ అధినేత స్థానాన్ని భర్తీచేయటానికి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రంగంలో దిగడంతో టీడీపీ వర్గీయుల్లో మరింత అలజడి తలెత్తిందన్నారు. జరగబోయే ఎన్నికల్లో తమకు సీటు వస్తుందో రాదో, పొత్తులో ఎగిరపోతామేమోనన్న ఆలోచనతో నాయకులు పిచ్చెక్కిపోతున్నారని వారు విమర్శించారు. సమావేశంలో సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ మూడమంచు బాలగురవయ్య, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాములు నాయక్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్.విజయకుమార్, వివిధ విభాగాల నాయకులు వై.వెంకటేశ్వరరెడ్డి, బి.బాలచెన్నయ్య, టి.రాంబాబు, ఒంగోలు సుబ్బారెడ్డి, హరినాయక్ పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలను ఉపేక్షించం

- పాత నేరస్తులపై నిఘా కొనసాగించాలి
- గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలి
- వినాయక చవితికి గట్టి బందోబస్తు ఏర్పాటు
- జిల్లా నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మలికాగర్గ్ ఆదేశాలు

ఒంగోలు టౌన్: ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికా గర్గ్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం జరిగిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేది లేదన్నారు. జైలు నుంచి విడుదలైన నేరస్తులపై నిరంతర నిఘా ఉంచాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. గంజాయి క్రయవిక్రయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో హైవేలపై ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని చెప్పారు. దొంగతనాలు జరగకుండా ముఖ్యమైన ప్రాంతాల్లో బీట్లు, లర్కింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రణాళికబద్ధమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యమైన కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్‌ను నిర్వహించాలని, బహిరంగంగా మద్యం సేవించే వాళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు. వినాయకచవితి పర్వదినం, ఉత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలను చేపట్టాలని ఆదేశించారు. గణేష్ ప్రతిమల నిమజ్జనం ప్రదేశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, పంచాయతీ, మున్సిపాలిటీ విభాగాలతో సమన్వయం చేసుకొని అప్రమత్తంగా విధులు నిర్వహించాలని చెప్పారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా, మర్యాదగా ప్రవర్తించాలని హితవు పలికారు. పోలీసు అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా పనిచేయాలని, ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని, బాధితులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని కలిగించాలన్నారు. తొలుత జిల్లాలోని పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్న వివిధ రకాల షీట్ల ప్రస్తుత పరిస్థితి, షీట్లలో ఉన్న వారిపై నమోదై ఉన్న కేసుల వివరాలను సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి స్థితిగతులను ఆరా తీశారు. నేర నియంత్రణకు పలు సూచనలు సలహాలిచ్చారు. నేరాల నియంత్రణకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కారం చూపేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) శ్రీధర్‌రావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీఎస్పీలు వి.నారాయణస్వామిరెడ్డి, రామరాజు, అశోక్‌వర్ధన్, వీర రాఘవరెడ్డి, వి.శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, లీగల్ అడ్వైజర్ వేణుగోపాల్, డీసీఆర్‌బీ సీఐ ధర్మేంద్ర బాబు తదితరులు హాజరయ్యారు.

సాత్విక్ హత్య ఛేదించిన వారికి ప్రశంసలు



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందుకున్న పోలీసులు

సంచలనం సృష్టించిన పదహారు నెలల బాలుడు మైలారి సాత్విక్ హత్య కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ మలికా గర్గ్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (క్రైం) యస్‌వీ శ్రీధర్‌రావు, కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు, పామూరు సీఐ కె.శ్రీనివాసరావు, కనిగిరి సీఐ రామకృష్ణారెడ్డి, పొదిలి సీఐ రాఘవేంద్ర రావు, త్రిపురాంతకం సీఐ పాపారావు, పామూరు, వెలిగండ్ల, గిద్దలూరు ఎస్సైలు సురేష్, మహేష్ కుమార్, మహెష్, దిశ ఎస్ఐ ఫాతిమా, మార్కాపురం పోలీసు స్టేషన్ మహిళా ఎస్ఐ సువర్ణ, సీఎస్ పరం హెడ్ కానిస్టేబుల్ అన్వేష్, కానిస్టేబుల్ ఆవులయ్య, ఐటీ కోర్ కానిస్టేబుల్ సురేష్‌కు ప్రశంస పత్రాలను అందజేశారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక స్వాతంత్య్రం

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాల్లో ఆర్థిక స్వాతంత్రం వచ్చిందని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని యడవల్లి సచివాలయం చర్లోపల్లె, యడవల్లి గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారనే విషయం మీకు తెలుసన్నారు. ఇంటింటికీ వెళ్లి సచివాలయ పరిధిలో అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. మీ ఇంటికి ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతి లబ్ధితో పాటు ఇంకా మీకు కావాల్సిన, తీర్చాల్సిన సమస్యలు ఏమైనా ఉంటే చెప్పండి అంటూ.. అడిగారు. సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే అందుతున్నాయని ప్రజలు తెలిపారు. ఇచ్చిన హామీల్లో 95 శాతం నెరవేర్చి చేతల ప్రభుత్వంగా ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, వర్గ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంక్షేమ పథకాలు పక్క రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, జెడ్పీటీసీ పగడాల దేవి, శ్రీరంగం, యడవల్లి ఎంపీటీసీ భనవం ధనమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, రామాపురం సొసైటీ అధ్యక్షుడు మదిరె శ్రీరంగారెడ్డి, యడవల్లి మాజీ సర్పంచ్ బైర్ల లలితమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు భవనం కోటేశ్వర్‌రెడ్డి, యన్నం లక్ష్మీరెడ్డి, షేక్ మునాఫ్, బైర్ల దేవదాసు, మొర్రి తిరుపతమ్మ, ఏ శేఖర్‌రెడ్డి, ఉసా నారాయణ, సూర పాండురంగారెడ్డి, ఎంపీడీవో కె.కవితా చౌదరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ చిన్న అబ్బాయి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అందరికీ సంతోషం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



వివిధ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి

మార్కాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రజలంతా ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా 34, 35 వార్డుల్లో వార్డు ఇన్‌చార్జి రోజ్‌లిడియా, వార్డు ఇన్‌చారి, కోఆప్షన్ మెంబర్ గుంటక వనజాక్షి చెన్నారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలుచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రైతు భరోసాల ద్వారా రైతులకు అందుబాటులో వారి గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారన్నారు.

దత్తపుత్రుడు చెప్పిందే చెబుతున్నాడు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో భేటీ అయి బయటకు వచ్చి టీడీపీతో కలిసి జనసేన పోటీ చేస్తుందని చెప్పిందే చెప్పడం దత్తపుత్రుడికి పనిగా మారిందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ కలిసే పోటీ చేస్తారని గడిచిన 4 ఏళ్ల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చెబుతూనే ఉందని దత్తపుత్రుడు ఇప్పుడు కొత్తగా చెప్పిందేమీ లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. చంద్రబాబు కానీ, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ కానీ, పుత్రుడు లోకేష్ కానీ తప్పుచేయలేదని ఎవరూ చెప్పడం లేదని ఎద్దేవా చేశారు. ఆయనను సరిగా తీసుకెళ్లలేదని, అరెస్టు సక్రమంగా చేయలేదని, సరిగా జైలులో పెట్టలేదని మాట్లాడుతున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు బుస్సెట్టి నాగేశ్వరరావు, చంద్ర, సిరాజ్, హర్షిత, నాగ అరుణ, షెహ్నావలి, ఉస్మాన్, ఉత్తమ్‌కుమార్, రంగలక్ష్మి, గుంటక వెంకటరెడ్డి, గుంటక చెన్నారెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ రమణారెడ్డి, కరీం బాషా, కొత్త కృష్ణ, కిట్టు, కరీముల్లా, డి.ప్రసాద్, చాంద్‌బాషా, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, కె. రంగయ్య, మయూరి ఖాశీం, కె. దుర్గ, కురాటి చెన్నకేశవులు, కమిషనర్ గిరి కుమార్, డీఈ సుభానీ, సచివాలయ సిబ్బంది, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
ఒంగోలు
శుక్రవారం ॥ 15-9-2023

ఫ్యాషన్





విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్‌ని ఇప్పుడు యూత్ ఫాలో అవుతోంది.
ఫోక్ సాంగ్స్‌ని ఆనందించినట్టే
ఫోక్ డ్రెస్సింగ్‌తో ఆకట్టుకోవాలనుకుంటున్నారు.
ట్రెండ్‌ను ఫాలో అవ్వద్దు, ట్రెండ్ సెట్టర్‌గా ఉండాలి అనే ట్యాగ్‌తో
కొంత వెస్ట్రన్ టచ్‌ని జత చేసి మరీ మెరిసిపోతున్నారు.
ఈ గణపతి నవరాత్రులకు మనదైన కళతో
వెలిగి పోవాలనుకునేవారికి ఈ స్టైల్ సరైన ఎంపిక అవుతుంది.

విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్

ధోతీ ప్యాంట్స్‌లో ఎన్నో మోడల్స్ వచ్చాయి. ఇవి అబ్బాయిల కోసమే అనేది పాత మాట. ప్రాచీన జానపద మూలాంశాలతో మనదైన సంప్రదాయ కళతో రూపొందింది ఈ స్టైల్. టులిప్ ప్యాంట్‌గా టర్న్ అయిన ఈ స్టైల్ ఈ నవరాత్రి వేడుకలలో హైలైట్ కానుంది. హెవీ ఎంబ్రాయిడరీ, పొట్లీ, షెల్ లేస్ ఉన్న ఫ్లెయిరీ కేడియా టాప్ నవరాత్రి ఉత్సవంలో రాక్ అండ్ రోల్ చేయడానికి పర్ఫెక్ట్ అవుట్ ఫిట్. ఇవి విదేశాలలోనూ చాలా ప్రాచుర్యం పొందాయి. చందేరీ, మధుబని, బ్లాక్ ప్రింట్‌లతో కలిపి ఈ ప్రత్యేకమైన దుస్తులను సిద్ధం చేస్తున్నారు డిజైనర్లు.



షర్ట్ అండ్ స్కర్ట్

ప్రింటెడ్ స్కర్ట్ లేదా పలాజో స్కర్ట్, కాలర్ నెక్ షర్ట్ సౌకర్యంగానూ ఉంటుంది. విలేజ్ స్టైల్‌కి వెస్ట్రన్ టచ్ ఇచ్చినా సంప్రదాయ లుక్‌తో ఆకట్టుకుంటుంది. ట్రైబల్ జ్యువెలరీ ధరిస్తే చాలు న్యూ లుక్‌తో మెరిసిపోతారు.

చెక్స్ శారీస్..

సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా మనదైన సంస్కృతిని ప్రతిబింబించేది చీరకట్టు. మామూలు రోజుల్లో ఎలా ఉన్నా, పండగలు, ప్రత్యేక రోజుల్లో మాత్రం చీర ధరించడం ఇప్పటికీ చూస్తుంటాం. అయితే.. వింటేజ్, విలేజ్‌తో పాటు ఫోక్ స్టైల్ కూడా కట్టులో తీసుకురావాలంటే మాత్రం చెక్స్ కాటన్ శారీ, సిల్వర్ జ్యువెలరీ మంచి ఎంపిక అవుతుంది.





మనవైన హ్యాండ్లూమ్స్

ఇక్కత్, బ్లాక్ ప్రింట్ అనార్కలీ, అంగరఖా, లాంగ్ గౌన్లు విలేజ్ స్టైల్‌లో ఆకట్టుకుంటాయి. ఘాగ్రా లేదా ఏదైనా పట్టు లెహంగా వంటివి ధరించినప్పుడు పటోలా దుపట్టాలు వేసుకుంటే విలేజ్ స్టైల్‌కి దగ్గరగా ఉన్నట్టే కాదు ప్రత్యేకంగానూ కనిపిస్తారు.





వినాయకుడికి వెరైటీ స్వీట్లు

ఈసారి వినాయకుడికి ఎంతో
ఇష్టమైన ఉండ్రాళ్లు, ఇతర నైవేద్యాలతోపాటు...
వైవిధ్యభరితమైన
మరెన్నో స్వీట్లను తినిపించి
ప్రసన్నం చేసుకుందాం....

వంటిల్లు



పనస పాఱోలి



కావలసినవి: బియ్యం – కప్పు; పనసపండు తురుము – ఒకటిన్నర కప్పులు (తొనలను సన్నగా తురమాలి); పచ్చికొబ్బరి తురుము – పావు కప్పు; అరటి ఆకులు – పాఱోలీకి సరిపడా.
స్టఫింగ్ కోసం: పచ్చికొబ్బరి తురుము – కప్పు; బెల్లం – ముప్పావు కప్పు; యాలుకలుపొడి – అరటీస్పూను.
తయారీ: ● బియ్యాన్ని కడిగి రెండు గంటలపాటు నానబెట్టుకోవాలి ● మందపాటి బాణలిలో బెల్లం, నాలుగు టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి వేసి మరిగించాలి ● బెల్లం కరిగి నురగలాంటి బుడగలు వస్తున్నప్పుడు పచ్చికొబ్బరి తురుము వేయాలి ● పాకంలో గరిట పెట్టి కలియతిప్పుతూ మిశ్రమం దగ్గర పడేంత వరకు మగ్గనివ్వాలి ● నీరంతా ఇంకిపోయినప్పుడు అర టీస్పూను యాలకుల పొడి కలిపి చల్లారనివ్వాలి ● ఇప్పుడు నానిన బియ్యంలో నీళ్లు తీసేసి బ్లెండర్‌లో వేయాలి ● దీనిలోనే పనసపండు తురుము, కొబ్బరి తురుము వేసి మెత్తని పేస్టులా గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని గిన్నెలో తీసుకోవాలి ● ఇప్పుడు అరటి ఆకులను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడుచుకోవాలి ● రుబ్బుకున్న బియ్యం పేస్టుని అరటి ఆకులపైన మందపాటి పొరలాగా వేసుకోవాలి. పొర మరీ మందంగా, మరీ పలుచగా కాకుండా మీడియంగా ఉండాలి ● చల్లారిన బెల్లం కొబ్బరి తురుముని పొరపైన మధ్యలో వేయాలి ● ఇప్పుడు అరటి ఆకుని నిలువుగా మడిచి ఆవిరి పాత్రలో పెట్టుకోవాలి ● ఈ ఆకులను ముప్పై నిమిషాలపాటు ఆవిరిమీద ఉడికిస్తే పనస పాఱోలీ రెడీ.

పతి శప్త



కావలసినవి:
మైదా – అరకప్పు; సూజీ రవ్వ – నాలుగు టేబుల్ స్పూన్లు; బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – టేబుల్ స్పూను; వంటసోడా – పావు టీస్పూను; పాలు – కప్పు; నెయ్యి – నాలుగు టేబుల్ స్పూన్లు.
స్టఫింగ్ కోసం: కోవా – కప్పు; ఎండుకొబ్బరి పొడి – ముప్పావు కప్పు; పంచదార పొడి – అర కప్పు; జీడిపప్పు – పది (సన్నగా తరగాలి); యాలకుల పొడి – అరటీస్పూను.
తయారీ: ● పెద్దగిన్నెలో సూజీ రవ్వ, బియ్యప్పిండి, వంటసోడా టేబుల్ స్పూను పంచదార పొడి, పాలు వేసి దోశ బ్యాటర్‌లా కలుపుకోని అరగంట నానబెట్టుకోవాలి ● బాణలిలో కోవా వేసి సన్నని మంట మీద వేయించాలి ● రంగు మారి మంచి వాసన వస్తున్నప్పుడు మంట ఆపేసి కొబ్బరి, పంచదార, యాలకులపొడి, జీడిపప్పు తరుగు వేసి కలపాలి ● ఇప్పుడు వేడెక్కిన పెనంపై కలిపి పెట్టుకున్న బ్యాటర్‌ను టేబుల్ స్పూను వేసి పలుచని చిన్న అట్టులా పోసుకోవాలి. దీనిచుట్టూ నెయ్యివేసి రెండు వైపులా బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు కాల్చాలి ● చక్కగా కాలిన అట్టు మధ్యలో కోవా మిశ్రమం వేసి రోల్‌లా చుట్టి పక్కన పెట్టుకోవాలి ● ఇలా బ్యాటర్ మొత్తాన్నీ రోల్స్‌లా చేసుకుంటే పతిశప్త రెడీ.

కేసి మిథోయ్



కావలసినవి: తాజా బియ్యప్పిండి – రెండు కప్పులు; పచ్చికొబ్బరి తురుము – కప్పు; పంచదార పొడి – అరకప్పు; యాలకులపొడి అరటీస్పూను; కొబ్బరి నీళ్లు – అరకప్పు.
తయారీ: ● తడి బియ్యప్పిండిని ఒక గిన్నెలో వేసుకోవాలి ● దీనిలో కొబ్బరి తురుము, పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి ● అవసరాన్ని బట్టి కొబ్బరి నీళ్లను కొద్ది కొద్దిగా వేసి పిండిని ముద్దలా కలుపుకోవాలి ● పిండి ముద్దను చిన్న భాగాలుగా చేసి, ఉండలుగా చుట్టుకోవాలి ● పిండి మొత్తాన్ని ఉండలుగా చుట్టుకుంటే కేసి మిథాయ్ రెడీ ● కొబ్బరి నీళ్లకు బదులు కొద్దిగా నెయ్యికూడా కలుపుకోవచ్చు ● రిఫ్రిజిరేటర్లో రెండుమూడురోజుల వరకు ఇవి తాజాగా ఉంటాయి.

బనానా మోదక్

కావలసినవి: గోధుమ పిండి – కప్పు; అరటిపండ్లు – రెండు; బెల్లం – ముప్పావు కప్పు; పచ్చికొబ్బరి తురుము – టేబుల్ స్పూను; అటుకులు – రెండు టేబుల్ స్పూన్లు; సూజీ రవ్వ – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – చిటికెడు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.
తయారీ: ● అరటిపండ్లు, బెల్లం, కొబ్బరి తురుము, అటుకులు, సూజీరవ్వను మిక్సీజార్‌లో వేసి కొద్దిగా నీళ్లుపోసి పేస్టులా గ్రైండ్ చేయాలి ● ఈ పేస్టుని పెద్దగిన్నెలో వేసి... గోధుమ పిండి, ఉప్పు, నెయ్యి, యాలకుల పొడి అన్ని కలిసి పోయేలా చక్కగా కలపాలి ● ఇప్పుడు ఈ పిండిని మోదక్‌లా లేదా నచ్చిన ఆకారంలో చేసుకుని మరుగుతోన్న నూనెలో వేసి డీప్ ఫ్రైచేయాలి ● మీడియం మంట మీద రెండు వైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు ఫ్రై చేస్తే బనానా మోదక్ రెడీ.

సేమియా లడ్డు



కావలసినవి: వేయించిన సేమియా – కప్పు; కోవా – అరకప్పు; పంచదార – ఐదు టేబుల్ స్పూన్లు; రోజ్‌వాటర్ – టీస్పూను; బాదం పలుకులు – మూడు టేబుల్ స్పూన్లు.
తయారీ: ● బాణలిలో పంచదార వేసి సన్నని మంటమీద కరగనివ్వాలి ● పంచదార కరుగుతున్నప్పుడే కోవా వేసి తిప్పాలి ● పంచదార కరిగి మిశ్రమం దగ్గర పడినప్పుడు సేమియా, బాదం పలుకులు వేసి కలపాలి ● అన్ని చక్కగా కలిసిన తరువాత రోజ్‌వాటర్ వేసి మరోసారి కలిపి స్టవ్ మీద నుంచి దించేయాలి ● ఇప్పుడు మిశ్రమాన్ని లడ్డుల్లా చుట్టుకుంటే వర్మిసెల్లి లడ్డు రెడీ.

స్వీట్ సందేష్



కావలసినవి: ఉడికించిన చిలగడ దుంప – పెద్దది ఒకటి; పచ్చికొబ్బరి తురుము – ముప్పావు కప్పు; జీడిపప్పు పొడి – పావు కప్పు; కొబ్బరి పాలు – అరకప్పు; పంచదార – అరకప్పు; యాలకులపొడి – అరటీస్పూను; రోజ్ వాటర్ – టీస్పూను.
తయారీ: ● చిలగడ దుంప తొక్క తీసి ఉండలు లేకుండా మెత్తగా చిదుముకోవాలి ● చిదుముకున్న చిలగడ దుంప మిశ్రమంలో జీడిపప్పు పొడి వేసి కలపాలి ● పంచదారలో కొద్దిగా నీళ్లుపోసి సుగర్ సిరప్‌ను తయారు చేసుకోవాలి ● సిరప్ తయారయ్యాక కొబ్బరి తురుము వేసి కలుపుతూ ఉండాలి ● తీగ పాకం వచ్చినప్పుడు చిలగడదుంప మిశ్రమాన్ని వేసి కలపాలి ● మిశ్రమం దగ్గర పడుతున్నప్పుడు కొద్దిగా కొబ్బరిపాలు వేయాలి ● మధ్యలో కొబ్బరి పాలతోపాటు యాలకులపొడి, రోజ్ వాటర్ వేసి కలుపుతూ మొత్తం కొబ్బరి పాలు అయిపోయేంత వరకు మగ్గనివ్వాలి ● దాదాపు ఇరవై నిమిషాల తరువాత ఈ మిశ్రమం దగ్గర పడుతుంది. అప్పుడు స్టవ్ ఆపేసేయాలి ● గోరువెచ్చగా ఉన్నప్పుడే మిశ్రమాన్ని చేతులతోగానీ, మౌల్డ్స్‌లోవేసి నచ్చిన ఆకారంలో వత్తుకుంటే స్వీట్ సందేష్ రెడీ.

న్యూస్‌మేకర్

ఆగొద్దు, పరుగు తీయండి


విత్య, నిత్య

'ముగ్గురు ఆడపిల్లల్ని కన్నావ్. ఎలా పెంచుతావో'
అని ఆ తల్లికి దారిన పోయేవారంతా సానుభూతి తెలిపేవారు.
పేదరికంతో అలమటిస్తున్న కుటుంబం అది.
ఆ తల్లి తన కూతుళ్లను ఆపదలచలేదు, ఆగిపోనివ్వలేదు. 'ఫ్రీగా తిండి పెడతారు.
తిని పరిగెత్తండి' అని ఇద్దర్ని తీసుకెళ్లి స్పోర్ట్స్ హాస్టల్‌లో పడేసింది.
కవలలైన ఆ ఇద్దరు అక్కా చెల్లెళ్లు ఇవాళ భారతదేశంలో
మేలైన అథ్లెట్లుగా మారారు. ఆసియన్ గేమ్స్‌కు క్వాలిఫై అయ్యారు.
కోయంబత్తూరుకు చెందిన విత్య, నిత్యల పరుగు కథ ఇది.

అబ్బాయిలు పుడితేనేనా సంతోషం? అమ్మాయిలు పుడితే బాధ పడాలా?

'నాకు లేని బాధ మీకెందుకు?' అని ఇరుగు పొరుగు వారితో అనేది మీనా.

కోయంబత్తూరులో నిరుపేదల కాలనీలో నివాసం ఉన్న మీనాకు మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. 'సత్య' అనే పేరు పెట్టింది. రెండో కాన్పులో ఏకంగా కవల ఆడపిల్లలు పుట్టారు. వారికి 'విత్య', 'నిత్య' అనే పేర్లు పెట్టింది. భర్త రామరాజ్ లారీ డ్రైవరు. డ్యూటీ ఎక్కితేనే సంపాదన. ఇంట్లో ఎప్పుడూ పేదరికమే. దానికి తోడు 'ముగ్గురు ఆడపిల్లలు'! 'ఎలా పెంచుతావో ఏమో' అని ఇంటికొచ్చిన అందరూ అనేవారు. కాని మీనా అస్సలు బాధ పడలేదు. భయపడలేదు. ఆడపిల్లలే కదా అని ఇంట్లో మగ్గేలా చేయలేదు. 'నా పిల్లలు చదువుకోవాలి. ఆడపిల్లలు పైకి రావాలంటే చదువే దారి' అని స్కూల్లో చేర్పించింది. పెద్దమ్మాయి సత్య చక్కగా చదువుకుంటే కవలలు విత్య, నిత్యలు స్కూల్లో హాకీ బాగా ఆడటం మొదలుపెట్టారు. కాని ఇంట్లో ప్రతి పూటా ఐదుగురికి ముద్ద నోట్లోకి వెళ్లాలంటే కష్టమైన సంగతి. స్కూల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ద్వారా స్పోర్ట్స్ స్కూల్ గురించి తెలిసింది. ఆ స్కూల్లో చేర్పితే చదువుతోపాటు ఆటలు నేర్పిస్తారు అని తెలుసుకుంది మీనా. ఇద్దరు కూతుళ్లు చిన్న పిల్లలు. ఏడవ తరగతిలో ఉన్నారు. కళ్ల ముందు పెరగాల్సిన బిడ్డలు. 'ఏం పర్వాలేదు. మీ భవిష్యత్తే ముఖ్యం. స్పోర్ట్స్ స్కూల్లో కడుపు నిండా తిని బాగా పరిగెత్తండి' అని చెప్పి కవల సోదరీమణులైన విత్య, నిత్యలను కోయంబత్తూరులోని స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్పించింది. ఆ తల్లి తపనను కూతుళ్లు అర్థం చేసుకున్నారు. బాగా ఆడారు. ఇవాళ విజేతలుగా నిలిచారు.

ఆసియా గేమ్స్ ఆశాకిరణాలు

మన దేశం నుంచి ఆసియా గేమ్స్‌లో పాల్గొన్న కవల క్రీడాకారులు తక్కువ. వారిలో మహిళా అథ్లెట్లు ఇంకా తక్కువ. మరో తొమ్మిది రోజుల్లో హాంగ్జువ్ (చైనా)లో మొదలుకానున్న ఆసియన్ గేమ్స్‌లో విత్య రామరాజ్, నిత్య రామరాజ్ పేర్లతో ఈ కవలలు పాల్గొనబోతున్నారు. విత్య 400 మీటర్ల హర్డిల్స్, ఫ్లాట్ రన్‌లో పాల్గొంటుంటే నిత్య 100 మీటర్ల పరుగులో పాల్గొననుంది. మన దేశం నుంచి మొత్తం 65 మంది ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు ఆసియా గేమ్స్ కోసం ఎంపికైతే వారిలో విత్య, నిత్య ఉన్నారు. 'ఇద్దరం ఎంపిక కావడంతో అమ్మ ఆనందానికి అవధులు లేవు. ఎవరో ఒకరు మాత్రమే అయితే ఆమె తప్పక బాధపడేది. ఆమె కోసం, దేశం కోసం ఎలాగైనా పతకాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నాం' అన్నారు విత్య, నిత్య.

పి.టి. ఉషతో సమానంగా

విత్య రామరాజ్ చెన్నైలో శిక్షణ పొంది గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ స్థాయి బంగారు పతకాలు గెలుస్తూ వచ్చింది. రెండ్రోజుల క్రితం చండీగఢ్‌లో జరిగిన గ్రాండ్‌ప్రిలో 400 మీటర్ల హర్డిల్స్‌ను 55.4 సెకెండ్లలో పూర్తి చేసింది. ఇది 1984 ఒలింపిక్స్‌లో పి.టి. ఉష రికార్డుకు కేవలం 0.01 సెకండ్ల కంటే తక్కువ. అంటే 39 సంవత్సరాల తర్వాత ఆ స్థాయి ప్రతిభను చూపే అథ్లెట్‌గా విత్య అవతరించింది. ఆనాడు ఆమె తల్లి ఆమెను ప్రోత్సహించకపోతే, ఆడపిల్లే అనుకుని ఖర్మకు వదిలిపెడితే ఈ రోజున ఇంత ప్రతిభతో నిలిచేదా? అలాగే నిత్య కూడా 100 మీటర్ల హర్డిల్స్‌లో మంచి ప్రతిభ చూపుతోంది. 'మేమిద్దరం ఆసియా గేమ్స్‌లో మెడల్స్ సాధించి ఒలింపిక్స్‌కు వెళ్లాలని అనుకుంటున్నాం. ఆశీర్వదించండి' అంటున్నారు విత్య, నిత్య.

ఇలాంటి క్రీడాకారిణులకు అందరి ఆశీస్సులూ ఉంటాయి.


తల్లి మీనాతో విత్య, నిత్య